తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలనా..?

- వరంగల్ సభలో నాపేరు కూడా పలకలేకపోయారు
- అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చిద్దాం రండి..
- పదేళ్లు ప్రజలు మెచ్చే పాలన అందిస్తాం
- కెసిఆర్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం
- బసవేశ్వరుడి బోధనలు నేటికీ అనుసరణీయం



సభలో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - కల్చరల్

పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని దోచుకున్న మీకు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదు.. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలనైందా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగసభలో కేసీఆర్ చేసిన విమర్శలపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ప్రధాన వేదికపై నిర్వహించిన సామాజిక సంస్కర్త బసవేశ్వర జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. 12వ శతాబ్దిలోనే సమాజంలో అసమానతలు, అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన బసవేశ్వరుడి బోధనలు నేటికీ అనుసరణీయమన్నారు. బసవేశ్వరుడు వ్యక్తికి, సమాజానికి ప్రాధాన్యత ఇచ్చారని, ఆయన స్ఫూర్తితో పంచాయతీ రాజ్ పార్లమెంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. ప్రతి వ్యక్తీ గౌరవంగా జీవించే ప్రణాళికలు ప్రభుత్వాలు రూపొందించాలని అన్నారు. కుల, మత, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన అభ్యుదయవాది బసవన్న స్ఫూర్తితో తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

అధికారంలో ఉన్న వారి నిర్ణయాలలో ఉన్న లోపాలను వెలుగులోకి తెచ్చేందుకు ప్రతిపక్షం ప్రయత్నించాలి కానీ నేడు రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం అలాంటి పాత్ర పోషించడం లేదని విమర్శించారు. ఇటీవల వరంగల్‌లో ఒకాయన సభ పెట్టి కాంగ్రెస్‌పై ద్వేషం వెళ్లగక్కారన్నారు. బిఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆర్‌టిసి నుంచి బస్సులు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరించిందన్నారు. తాము చేసిన మంచిని సభలో అభినందించి ప్రజా సమస్యలను అక్కడ ప్రస్తావించి ఉంటే ప్రజలు మెచ్చుకునేవారని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి రాకుండా జీతభత్యాలు, వసతులు ఉపయోగించుకుంటున్న ఆయనకు తమ ప్రభుత్వాన్ని విమర్శించే నైతికత ఉందా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడిగా రూ.65 లక్షలు, వాహనాలు, పోలీసు భద్రత తీసుకున్నారని తెలిపారు. ఫామ్‌హౌస్‌లో పడుకుని ప్రజలకు ఏం సందేశం ఇవ్వదలచుకున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాను.. మా పిల్లల్ని పంపామని చెబుతున్నారు.. పిల్లలను సభకు పంపితే మీరెందుకు ప్రతిపక్ష నేతగా ఉన్నారు? సభకు రాని ప్రతిపక్ష నేతకు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు ఉందా? అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు ఆగిపోయాయంటున్నారని, రైతుబంధు, ఆరోగ్యశ్రీ, ఉచిత కరెంటు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి వీటిలో ఏది ఆగిపోయిందని ప్రశ్నించారు. తమరు ఏ మత్తులో తూగుతున్నారో మీకే తెలియాలని ఎద్దేవా చేశారు. మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. కడుపు నిండా విషం పెట్టుకొని విద్వేష పూరితప్రసంగం చేశారని విమర్శించారు. అభివద్ధి, సంక్షేమ పథకాలపై చర్చిద్దాం రండి.. అని సవాల్ విసిరారు. ప్రజలు విజ్ఞులని, ఎవరేం చేశారో వారికి తెలుసని అన్నారు. పదేళ్లు ప్రజలు మెచ్చే పరిపాలన చేస్తామన్నారు. వంద ఎలుకలను తిన్న పిల్లి తీర్థయాత్రకు వెళ్లినట్టు కేసీఆర్ వరంగల్ వెళ్లారని, సభలో తన పేరు కూడా పలకలేకపోయారని అన్నారు. తెలంగాణ అగం కాలేదని, ఆయన కుటుంబమే ఆగమైందని అన్నారు. బసవేశ్వరుడి స్ఫూర్తితో రాష్ట్ర ఆదాయం పెంచాలి, పేదలకు పంచాలి అనే విధానంతో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి సురేష్ షెట్కర్, షబ్బీర్ అలీ, వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్‌కు అంతర్జాతీయ గుర్తింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. సన్న బియ్యం పంపిణీతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థలో మెరుగైన సేవలు అందిస్తున్నందుకుగాను కార్పోరేషన్ గుర్తింపులోకి వచ్చింది. ఈ మేరకు బుధవారం ఎర్రమంజిల్ కాలనీలోని పౌర సరఫరాల కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ఐ.ఎస్.ఓ పత్రాన్ని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ అందుకున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు సేవలు అందించడంలో చౌహాన్ తీసుకున్న నిర్ణయాలను గుర్తించిన హెచ్.వై.యం అంతర్జాతీయ సంస్థ ఈ సర్టిఫికెట్‌ను అందజేసింది. కార్పొరేషన్ తీసుకొచ్చిన పలు సంస్కరణలను అధ్యయనం చేసిన ఆ సంస్థ నాణ్యత ప్రమాణాలు పాటించడాన్ని గుర్తించి ఐదు నక్షత్రాల రేటింగ్‌తో కూడిన ఐ.ఎస్.ఓ 9001 సర్టిఫికెట్‌ను రాష్ట్ర కార్పొరేషన్‌కు ఆ సంస్థ అందజేసింది. శాఖ పని తీరు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిబింబింపజేస్తుందని చౌహాన్ వ్యాఖ్యానించారు. ఇది సమిష్టిగా సాధించిన విజయమని ఆయన పేర్కొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి

- మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టుల పేరిట ఆదివాసీలను చంపుతున్నదని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్రెగుట్టల్లో మావోయిస్టు కీలక నాయకులున్నారనే సమాచారంతో 20 వేల మంది భద్రతా సిబ్బందితో కూంబింగ్ జరుపుతున్నట్టు మీడియాలో వార్తలొ స్తున్నాయని పేర్కొన్నారు. మావోయిస్టులు అట్టడుగు స్థానంలో బతుకు లీడుస్తున్న భారతీయుల బాగుకోసం ఉద్యమాలు చేస్తున్నారని వివ రించారు. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమంటూ వారు లేఖ పంపించారని తెలిపారు. రాజకీయ పార్టీలు కూడా ఆపరేషన్ కగార్‌ను నిలిపేసి, చర్చలను కొనసాగించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశాయని గుర్తు చేశారు. కేంద్రం మాత్రం 'మావోల అంతం మా పంతం'అనే పద్ధతిలో వ్యవహరిస్తున్నదని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కానీ దేశంలో ప్రజల మధ్య ఉన్న సామాజిక అంతరాలు పోలేదని వివరించారు. ఆర్థిక అంతరాలైతే మిస్సైళ్ల వేగంతో పెరిగిపోతున్నాయని తెలిపారు. ఆర్థిక, సామాజిక అంతరాలను తగ్గించే విధంగా పాలన చేయలేక, ప్రశ్నించే వారిని చంపటమే లక్ష్యంగా ఆపరేషన్ కగార్‌ను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన విధానాలను మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్థిక, సామాజిక అంతరాలను తగ్గించే పద్ధతిలో పనిచేయాలని సూచించారు. కర్రెగుట్టల్లో కూంబింగ్ ఆపి చర్చలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

కెఆర్ఎంబి చైర్మన్ అతుల్‌జైన్‌కు సిడబ్ల్యుసి అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణా నదీ జలాల యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) చైర్మన్ అతుల్‌జైన్‌కు కేంద్ర జలసంఘం (సిడబ్ల్యుసి) చైర్మన్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈమేరకు బుధవారం కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి అనిల్‌కుమార్ శర్మ ఆదేశాలు జారీచేశారు. మూడు నెలలపాటు అతుల్‌జైన్ ఈ బాధ్యతల్లో ఉంటారు. ఈ కాలంలో ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తారు. సిడబ్ల్యుసి బాధ్యతల్లో వెళుతున్న అతుల్‌జైన్‌ను రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇఎన్‌సి జనరల్ జి అనిల్‌కుమార్, ఎన్‌డిఎస్‌ఎ చైర్మన్ అనిల్‌జైన్ అభినందనలు తెలిపారు.

ట్రంప్ టారీఫ్‌లతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదం

- వర్ధమాన దేశాలు అప్రమత్తంగా ఉండాలి
- చైనా బాధ్యత తీసుకోవాలి
- జెఎన్‌యు ప్రొఫెసర్ అరుణ్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికా అధ్యక్షులు ట్రంప్ టారిఫ్‌లతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదమని జవహర్‌లాల్ విశ్వవిద్యాలయం రిటైర్ట్ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. వర్ధమాన దేశాలు అప్రమత్తంగా ఉండి అమెరికాపై మూకుమ్మడి పన్నులు విధిస్తే నిలదొక్కుకునే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ట్రంపు టారిఫ్‌లతో ఆ దేశ ప్రజలూ అధికంగా నష్టపోతారని అభిప్రాయపడ్డారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'ట్రంపు టారీఫ్‌ల యుద్ధం, పరిణామాలు' అనే అంశంపై నిర్వహించిన వెబినార్‌కు ఎస్‌వికె కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వకర్తగా వ్యవహరించగా సీనియర్ జర్నలిస్టు కొండూరి వీరయ్య అనువాదం చేశారు. ఈసందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ట్రంప్ టారీఫ్‌ల నేథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలికంగా సంక్షోభంలోకి వెళుతుందని హెచ్చరించారు. ఉత్పత్తి పడిపోతుందని చెప్పారు. కొత్త అవకాశాలు వెతుక్కోవాల్సి రావచ్చని వివరించారు. పరిశ్రమలు మూతపడతాయి, ఉపాధి పోతుంది, కోనుగోలు శక్తి తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ట్రంపు ఇతర దేశాలపై పన్నులేయడంతోపాటు ఇతర అనేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. లోటును తగ్గించుకునే క్రమంలో ఆ దేశ విద్యాశాఖనే రద్దుచేశారని తెలిపారు. అన్నీ ప్రభుత్వ శాఖల నిధులకు కోతపెడుతున్నారనీ, వేలాది ఉద్యోగాలను రద్దు చేశారని గుర్తు చేశారు. దీంతో అమెరికా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ, భవిష్యత్తులో ఇవి మరింత పెరుగుతాయని అన్నారు. తద్వారా దేశీయంగా కొనుగోలు శక్తి ఉండదని వివరించారు. ఇప్పుడు చైనా వాణిజ్యపరంగా నాయకత్వ పాత్ర తీసుకునేందుకు అవకాశాలు ఉంటాయని చెప్పారు. బాధ్యతాయుత దేశంతో వ్యహరిస్తే మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. ట్రంపు టారీఫ్‌ల గురంచి భారతదేశం ఎలా స్పందిస్తుందో చూడాలన్నారు. వర్ధమాన దేశాలకు ఇచ్చే రాయితీలు భారత్‌కు డబ్ల్యూటీవో ఇస్తున్నదనీ, ఇప్పుడు ట్రంపు వాటిని రద్దుచేయాలని ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. ఒకవేళ నిజంగానే రాయితీలు ఉపసంహరిస్తే వ్యవసాయ, ఆహార ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్పారు.

ఎరువుల ధరలు పెరుగుతాయనీ, ఉపాధి తగ్గిపోవడంతోపాటు కొనుగోలు శక్తి నశిస్తుందని పేర్కొన్నారు. మొత్తంగా ట్రంపు వైఖరి భారతదేశాన్ని, ప్రపంచాన్ని విషవలయంలోకి నెడుతుందన్నారు. ట్రంపు అధికారంలోకి రాకముందు నుంచే ఆయన మాటల ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఉందన్నారు. ఈనేపథ్యంలోనే బంగారం ధర పెరుగున్నదని గుర్తు చేశారు. ఉక్రెయిన్ పరిణామాలు కూడా కారణమేనని చెప్పారు. ప్రపంచ దేశాలపై ఆధారపడుతూ అమెరికా పరాన్నబుక్కుగా మారిందని విమర్శించారు. అమెరికా విషయంలో వర్ధమాన దేశాలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

తెలుగులో గ్రూప్-1 పరీక్ష ఎంతమంది రాశారో వివరాలివ్వండి

- టిజిపిఎస్‌సికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1 పరీక్షల వ్యవహారంపై హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం సైతం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ.. వరుస హాల్ టికెట్ల వారికి ఒకే మార్కులు వచ్చాయని, నిర్దేశించిన సమయానికి ప్రొవిజనల్ మార్కుల జాబితా ఇవ్వలేదని కోర్టుకు వివరించారు. 20 రోజుల తర్వాత తుది మార్కులు వెల్లడించారని, ఆ 20 రోజుల్లో అవకతవకలు జరిగాయనే అనుమానంగా ఉందన్నారు. పిటిషనర్ల వాదనలు విన్న ధర్మాసనం.. మూల్యాంకన ప్రక్రియ గురించి టిజిపిఎస్‌సిని వివరాలు అడిగి తెలుసుకుంది. తెలుగులో రాసిన అభ్యర్థులకు ఎలా మార్కులు వేశారని ప్రశ్నించింది. "తెలుగులో రాస్తే తక్కువ మార్కులేశారన్న ఆందోళన ఉంది. జవాబులకు సంబంధించి ఏదైనా కీ పేపర్ ఉంటుందా? తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల కీ ఇచ్చారా?' అంటూ టిజిపిఎస్‌సికి ప్రశ్నలు సంధించింది. కాగా.. కమిషన్ స్పందిస్తూ ఎవాల్యుయేటర్లకు ఎలాంటి కీ ఇవ్వలేదని తెలిపింది. రాతపూర్వక పరీక్ష కావడంతో కీ ఇవ్వడం కుదరదని, జవాబు పత్రాలు దిద్దిన వారు ఆయా సబ్జెక్టుల్లో నిపుణులని కోర్టుకు వివరణ ఇచ్చింది. అయితే, తెలుగులో ఎంతమంది రాశారో, ఎంత మంది ఎంపికయ్యారో వారి వివరాలు ఇవ్వాలని టిజిపిఎస్‌సిని కోర్టు ఆదేశించింది. ఈ పరీక్షతోపాటు గత గ్రూప్-1 అభ్యర్థుల సమాచారం కూడా ఇస్తామని టిజిపిఎస్‌సి తెలిపింది. చాలా ఏళ్లుగా నిరుద్యోగులు గ్రూప్ - 1 కోసం ఎదురుచూస్తున్నారని, ఆలస్యం లేకుండా విచారణ ముగించాల్సి ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

వచ్చే ఐదు రోజులపాటు వర్షసూచన!

- పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ
- రాష్ట్రంలో మళ్లీ పెరుగుతున్న ఎండలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే ఐదు రోజులపాటు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబగద్వాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశాలున్నాయి. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో వీచే సూచనలున్నాయి. బుధవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 76 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. రాజన్నసిరిసిల్ల రుద్రగిరిలో అత్యధికంగా 6.88 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. బుధవారం నిజామాబాద్‌లో అత్యధికంగా 43.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది.

కర్రెగుట్టలపై త్రివర్ణ పతాకం

- తాత్కాలిక పోలీస్ శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


యుద్ధ భూమిగా మారిన కర్రెగుట్టలపై 9వ రోజు బుధవారం భద్రతా బలగాలు తివర్ణ పతాకాన్ని ఎగురవేసి అధిపత్యాన్ని ప్రదర్శించాయి. కర్రెగుట్టలపై క్షణక్షణం ఏమి జరుగుతుందో అనే ఉత్కంఠ సమయంలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన 150 మందు పాతరలను ఇప్పటికే కనిపెట్టి నిర్వీర్యం చేశాయి. భద్రతా దళాలు హెలికాప్టర్ సహకారంతో గుట్టల శిఖర భాగాన కాలు మోపి త్రివర్ణ జెండాను ఎగురవేశాయి. మావోయిస్టుల ప్రధాన కార్యకలాపాలు కర్రెగుట్టల నుండే జరుగుతున్నాయని పలువురు పోలీసు ఉన్నతాధికారులు అంటున్నారు. మావోయిస్టులపై సమగ్ర రణరంగం ప్రారంభమైందని, వారు అంతమయ్యే దాకా ఆగదని చెబుతున్నారు. ఛత్తీస్‌గఢ్ -తెలంగాణ సరిహద్దులోని కర్రెగుట్ట ప్రాంతంలో భద్రతా దళాలు నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో గుట్టలో కొంత భాగాన్ని స్వాధీనం చేసుకున్నాయి. ఏప్రిల్ 22 నుంచి దేశ చరిత్రలోనే అతిపెద్ద మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌గా ఈ చర్య కొనసాగుతోంది. కర్రెగుట్ట, దుర్గమ్‌గుట్ట, పూజారి కాంకేర్ వంటి కొండల పరిసర ప్రాంతాలు కలిపి దాదాపు 280 కి.మీ. పరిధిలో విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని మావోయిస్టుల నేతలు హిడ్మా, దేవా, దామోదర్, వికాస్, సుజాత, ఆజాద్ లాంటి వారు ప్రధాన స్థావరంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 1500 నుంచి 2000 మంది మావోయిస్టులు ఆధునిక ఆయుధాలతో మోహరించినట్టు సమాచారం. వీరు అమర్చిన ఐఈడిలు కూడా పెద్ద ఎత్తున ఉన్నట్టు గుర్తించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి డీఆర్‌జీఎఫ్ సీఆర్‌పిఎఫ్ కోబ్రా, బస్తర్ ఫైటర్స్‌కు చెందిన దళాలు మొత్తం 10 వేలకుపైగా సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్ శర్మ మాట్లాడుతూ.. మావోయిస్టుల నిర్మూలన దిశగా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందని, 18 నెలల్లో బస్తర్ ప్రాంతంలో 350 మందికి పైగా మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినట్టు తెలిపారు. రాష్ట్రం తరపున కేంద్రానికి పలు నివేదికలు సమర్పించామని చెప్పారు. మావోయిస్టులు లొంగిపోవాలని పిలుపునిస్తూ, శాంతి చర్చల ప్రతిపాదనలను నిరాకరించారు.

రబీ ధాన్యం కొనుగోలుకు రూ.15 వేల కోట్లు

- యాసంగిలో రికార్డ్ స్థాయిలో ధాన్యం దిగుబడి
- 8,381 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం : ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాసంగిలో పండిన పంటను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15,000 కోట్లు విడుదల చేసిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ధాన్యం దిగుబడిలో ఖరీఫ్ సీజన్‌లో యావత్ భారతదేశంలోనే రికార్డ్ సృష్టించిన తెలంగాణా రాష్ట్రం రబీ సీజన్‌లోనూ అదే రికార్డ్ సృష్టించబోతుందని ఆయన పేర్కొన్నారు. యాసంగిలో రాష్ట్ర రైతాంగం 54.89 లక్షల ఎకరాల్లో సాగు చేయగా 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేస్తున్నామని ఆయన తెలిపారు. 70 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకుగాను ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించుకున్నట్టు ఆయన ప్రకటించారు. బుధవారం హైదరాబాద్ ఎర్రమంజిల్ కాలనీలోని పౌర సరఫరాల శాఖ కేంద్ర కార్యాలయం నుంచి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్రంలోనీ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేరువేరు ప్రాంతాల నుంచి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాల శాఖ రూపొందించిన విధి విధానాలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖా ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్‌లతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సునిశితమైందనీ, రానున్న 20 రోజులు అత్యంత కీలకమైనవనీ, ఈ సమయంలో కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ అధికార యంత్రాంగాన్ని సమన్వయం చెయ్యాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడినట్టు కలెక్టర్ల దృష్టికి వస్తే సత్వరమే చర్యలు తీసుకోవడంతో పాటు పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డి ఎస్.చౌహాన్‌ను సంప్రదించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు మద్దతు ధరను రైతుల ఖాతాలో జమ చేయడంతో పాటు సన్నాలకందించే బోనస్ చెల్లింపులకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కొనుగోళ్లకుగాను ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 8,381 కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు 13.71 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. మరో 3.79 కోట్ల గోనె సంచులు సమీకరిస్తున్నట్టు మంత్రి వివరించారు. అయితే తేమ శాతాన్ని పరిశీలించిన మీదటనే రైతులకు గోనె సంచులు పంపిణీ చేయాలని ఆయన సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు గోదాములు అందుబాటులో లేని చోట్ల నేరుగా రైస్ మిల్లులకు తరలించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మధ్యంతర గోదాముల వసతి ఉన్న చోట కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని ఆయా గోదాములకు తరలించాలన్నారు. అవసరమని భావించిన ప్రాంతాల్లో ఇప్పటికే పది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిలువ ఉంచే సామర్థ్యం కలిగిన గోదాములను కేటాయించినట్టు ఆయన చెప్పారు. ఇప్పటికే 29 లక్షల మెట్రిక్ టన్నులకుపైబడి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరిందనీ, సుమారు 2.55 లక్షల రైతుల నుంచి 19.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు ఆయన వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం అందించే మద్దతు ధర ప్రకారం రూ.4,545.72 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ. 2,289 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని ఆయన తెలిపారు. సన్నాలకు ప్రభుత్వం అందిస్తున్న బోనస్ మొత్తం రూ. 444.20 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమౌతుందన్నారు. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు రైతాంగానికి తెలియ జెప్పేందుకు వీలుగా కొనుగోలు కేంద్రాల్లో ప్రతి రోజు ఉదయం వాతావరణ సమాచారాన్ని వివరిస్తున్నట్టు ఆయన చెప్పారు. అంతేకాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటుగా ఎండ వేడిమికి ఇబ్బంది పడే రైతులకు ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. తేమ శాతాన్ని తెలియజెప్పే డయ్యర్‌లను కొనుగోలు చేసిన కరీంనగర్ కలెక్టర్‌ను అభినందించారు. మిగిలిన జిల్లాల్లో కుడా ఇది అమలు చేయాలని సూచించారు. దీంతో ధాన్యం నాణ్యతతో పాటు త్వరితగతిన కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆయా జిల్లాల కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించేందుకు వీలుగా వాహనాలను ఏర్పాటు అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని 1,579 రైస్ మిల్లులను సిఎంఆర్ నిమిత్తం గుర్తించినట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే 45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆయా రైస్ మిల్లులకు కేటాయించినట్టు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.



రేషన్ కార్డు ధరఖాస్తుల పరిశీలన

కొత్తగా మంజూరు చేయనున్న తెల్ల రేషన్ కార్డుల కోసం లబ్దిదారులు పెట్టుకున్న దరఖాస్తులను సునిశితంగా పరిశీలిస్తున్నట్టు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పరిశీలన పూర్తి అయిన వాటిని ఎప్పటికప్పుడు అప్డేట్ చెయ్యాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఇంటెలిజెన్స్ ఓఎస్‌డిగా విబి కమలాసన్ రెడ్డి

హైదరాబాద్ బ్యూరో : ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఓఎస్‌డిగా, తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్‌గా వి.బి.కమలాసన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల పాటు ఆయన ఆ హోదాల్లో కొనసాగనున్నారు.

ఖనిజ సంపద దోచుకునేందుకే బిజెపి కుట్ర

- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- ఆదివాసులను హత్య చేయడం అమానుషం
- మే ఒకటి నుంచి 8 వరకు మే డే ఉత్సవాలు : జాన్‌వెస్లీ


అమరుల సంస్మరణ సభలో వారికి నివాళులర్పిస్తున్న జాన్ వెస్లీ తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మతోన్మాద బిజెపి ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అడవుల్లో నిక్షిప్తమై ఉన్న ఖనిజ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకే మావోయిస్టుల పేర ఆపరేషన్ 'కగార్'తో అమాయకులైన ఆదివాసీలను హత్య చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టులు కోరుకుంటున్న విధంగా వారితో శాంతిచర్చలు జరపాలన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కర్రెగుట్ట ప్రాంతం నుంచి కేంద్ర, రాష్ట్ర పోలీస్ బలగాలను వెంటనే వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందంటూ చేస్తున్న ఆరోపణల వివరాలు అఖిలపక్ష పార్టీల ముందుంచాలన్నారు. అధికారుల నివేదికలు బయట పెట్టాలన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా మహిళలను అగౌరవపరిచే విధంగా అందాల పోటీలు నిర్వహించేందుకు ఆరాటపడుతోందని విమర్శించారు. రైతుల ధాన్యాన్ని వెంటనే తూకం వేస్తూ డబ్బులను ఖాతాలో జమ చేయాలని కోరారు. శివన్నగూడెం రిజర్వాయర్ నుంచి రాచకొండ ఎత్తిపోతల పథకం చేపట్టి చౌటుప్పల్, నారాయణపురం మండలాలతో పాటు రంగారెడ్డి జిల్లా ప్రజలకు సాగునీరు అందించాలని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. మే ఒకటి నుంచి 8 వరకు మే డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రజా సమస్యలను పక్కనపెట్టి ప్రజల మధ్య విభేదాలు సృష్టించే పనిలో ఉందని విమర్శించారు. సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు సాగు, తాగునీరందించడంలో గత, ప్రస్తుత పాలకులు విఫలం చెందారని విమర్శించారు. జిల్లాకు మూడు వైపులా గోదావరి, కృష్ణ, మూసీ వంటి జీవనదులున్నా నీటిసమస్యను పరిష్కరించడం లేదన్నారు. మునుగోడు నియోజకవర్గానికి బస్వాపురం, పాలమూరు రంగారెడ్డి నుంచి, శివన్నగూడెం ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విలన్ పాత్ర పోషిస్తున్నారంటూ ప్రతిపక్షాలపై ఆరోపణలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసి హీరో అవుతారో.. అమలు చేయకుండా జీరో అవుతారో తేల్చుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శ్రీనివాసచారి, మండల కార్యదర్శి దోడ యాదిరెడ్డి, సీనియర్ నాయకులు దోనూరు నర్సిరెడ్డి, సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, చింతకాయల నర్సింహ పాల్గొన్నారు.

గట్టుప్పల్‌లో అమరుల సంస్మరణ సభ

నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన అమరుల సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పాల్గొని ప్రసంగించారు. అమరవీరుల చిత్రపటాలకు పలువురు నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. ఉమ్మడి చండూరు మండలంలో పార్టీ కోసం పనిచేసి అమరులైన 136 మంది కార్యకర్తలు, నాయకుల సంస్మరణ సభ నిర్వహించినందుకు గట్టుప్పల్ మండలం కమిటీని జాన్‌వెస్లీ అభినందించారు.

సిపిఎంలో చేరిక

గట్టుప్పల్ మండలం అంతంపేట, గట్టుప్పల్, తేరటిపల్లి, చండూరు మండలం నెర్మట, మునుగోడు మండలం కొరటికల్, కలువలపల్లి, కృష్ణాపురం గ్రామాలకు చెందిన 70 కుటుంబాలు వివిధ పార్టీలను వీడి సిపిఎంలో చేరారు. పార్టీలో చేరిన వారికి జాన్‌వెస్లీ, జూలకంటి రంగారెడ్డి కండువాలు కప్పి సాధారణంగా ఆహ్వానించారు. అంతకుముందు పోరెడ్డి సత్తిరెడ్డి జ్ఞాపకార్థం 136 మంది అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు కేంద్రం కోసం ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రామోజీ కుమ్మరిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఇల్లంద సెంటర్‌కు తమ గ్రామం దూరంగా ఉందని రైతులు ఆందోళన నిర్వహించారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఇల్లంద-రామోజీ కుమ్మరిగూడెం రహదారిపై ధర్నాకు దిగారు. ఇల్లంద మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రానికి రావడానికి ఇబ్బందిగా ఉందని, ప్రత్యేకంగా తమ గ్రామంలోనే కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు చేసే సెంటర్ల పరిధిలో ధాన్యం ఆరబోయడానికి స్థలం ఉండాలని, సరిపడా స్థలం లేకపోతే అక్కడ సెంటర్‌కు ఇబ్బంది ఏర్పడుతుందని ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేయలేదని వర్ధన్నపేట ఏపీఎం వేణు తెలిపారు. అందువల్ల ఇల్లందలో ఉన్న సెంటర్‌కు రావాలని సూచించారు.

అక్షరాలతో అగ్గి రవ్వలు పుట్టించిన ప్రజాకవి శ్రీ శ్రీ

- టిపిఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



అక్షరాలతో అగ్గి రవ్వలు పుట్టించి.. చందస్సు సంకెళ్లను తెంచిన ప్రజాకవి శ్రీశ్రీ అని టిపిఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ప్రముఖ కవి శ్రీశ్రీ 115వ జయంతి సందర్భంగా హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే హాల్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ చిత్రపటాలను చేబూని శ్రీ శ్రీ కవిత్వం వర్ధిల్లాలి అంటూ యువత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీశ్రీ మాట పీడిత పక్షం.. ఆయన బాట ప్రజా మార్గం.. అతను ఒక నిప్పు - అక్షరాల అగ్ని కణికలు.. అతడొక సాహిత్య సముద్రం.. అతడు ఒక తరాన్నే ప్రభావితం చేసిన యుగ స్వరం విప్లవ నాదం, మహోగ్రనాదం అని కవితీకరించారు. 20వ శతాబ్దపు తొలి, చివరి అక్షరం కూడా అతనేనని చెప్పొచ్చన్నారు. ఈ ప్రపంచాన్ని ఒక కుదుపు కుదిపినవాడు శ్రీశ్రీ అని కొనియాడారు. అప్పటివరకు సమాజంలో ఉన్న దోపిడీ సిద్ధాంతాలకు ప్రత్యామ్నాయంగా ముందుకు తెచ్చిన సిద్ధాంతం కమ్యూనిజం అని అన్నారు. దాని సిద్ధాంతపు లోతులను సులభతరం చేసి దేశచరిత్రల పేరుతో అక్షరాన్ని ఆయుధం చేసి అందించిన లోక కవి, ఏకైక ప్రజాకవి అని అన్నారు. సమసమాజ సామ్యవాద భావాజాలాన్ని తన కవిత్వంలో ఎత్తి పట్టారని, కొత్త నడక, సరికొత్త ఆలోచనలతో తిరోగమన సాహిత్యాన్ని భూమార్గం పట్టించారని చెప్పారు. సామాన్యుడి చుట్టూ ఆయన సాహిత్యం తిరిగిందని, సినీ గీతాల ద్వారా కూడా సామాన్యులకు దగ్గరైనారని, అందుకే శ్రీశ్రీ యుగకవి అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లల బాలకష్ణ, టిపిఎస్‌కె హైదరాబాద్ సెంట్రల్ సిటీ కన్వీనర్ జి.నరేష్, నాయకులు విజయ్ కుమార్, కవి పొన్నం రాజయ్య గౌడ్, యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు వేసవి సెలవులు

- నేటి నుంచి నెలపాటు వర్తింపు
- హర్షం వ్యక్తం చేసిన అంగన్‌వాడీ యూనియన్లు
- సిఐటియు పోరాట విజయం : విజయలక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ చిన్నారులకు గురువారం నుంచి ఈ నెల 31 వరకు సెలవులు ప్రకటిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు త్వరలో విడుదల కానున్నాయి. తల్లిదండ్రులు, అంగన్‌వాడీ యూనియన్ల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నది. అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు తర్వాత సెలవులు ప్రకటించడం ఇదే తొలిసారి. బుధవారం హైదరాబాద్‌లోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్ లో అంగన్‌వాడీ యూనియన్లతో డైరెక్టర్ కాంతి వెస్లీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెలవులు ప్రకటించాలనే నిర్ణయాన్ని ఆ శాఖ తీసుకున్నది. అంగన్వాడీ లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు టేక్ హోం రేషన్ ద్వారా గుడ్లు, సరుకుల సరఫరా చేయనున్నది. సెలవు కాలంలో అంగన్వాడీ టీచర్లకు ఇతర విధులు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నది. ఇంటింటి సర్వే, హోం విసిట్స్, అంగన్‌వాడీలలో చేర్చాల్సిన వయస్సు ఉన్న చిన్నారుల గుర్తింపు, వారి కేంద్రాలకు పంపేలా తల్లిదండ్రులను ఒప్పించడం వంటి బాధ్యతలను అప్పగించనున్నది.

రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు : సీఐటీయూ

అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెలంతా సెలవులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు


అంగన్‌వాడీ యూనియన్లతో డైరెక్టర్ కాంతి వెస్లీ

కె.సునీత, పి.జయలక్ష్మి, ఉపాధ్యక్షులు కె.సమ్మక్క ధన్యవాదాలు తెలిపారు. ఇది సీఐటీయూ పోరాట విజయమని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇదే విషయంపై మార్చి నాలుగో తేదీన ప్రజావాణి ముట్టడించామనీ, మార్చి 17,18 తేదీల్లో 48 గంటల పాటు ధర్నా చేశామని గుర్తుచేశారు. ఏప్రిల్ 24న కలెకరేట్ల ముట్టడి చేశామని తెలిపారు. మంగళవారం ములుగు జిల్లాలో మంత్రి క్యాంపు ఆఫీసు ముందు కూడా ధర్నా చేశామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ మీటింగ్ నిర్వహించి మే నెలంతా సెలవులు ఇస్తూ నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. ఇలాంటి నిర్ణయం రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి అని పేర్కొన్నారు.

అందాల పోటీలను రద్దు చేయాలి

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు పోరాట వేదిక వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో జరగబోయే ప్రపంచ సుందరి 72వ అందాల పోటీలను వెంటనే రద్దు చేయాలని 'మిస్‌వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక పోరాట వేదిక' డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్‌లో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు వేదిక నాయకులు పిఒడబ్ల్యు జాతీయ నేత పి. సంధ్య, ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. అరుణజ్యోతి, మల్లు లక్ష్మి, ఏఐఎమ్ఎస్ఎస్ నేత ఈ.హేమలత, పీవోడబ్ల్యూ నేత లక్ష్మిబాయి, రాష్ట్ర అధ్యక్షులు స్వరూప, ఎన్ఎస్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి ఎన్. జ్యోతి, ప్రైముదలతో కూడిన బృందం వినతిపత్రం అందజేసింది. 'అందాల పోటీలు మహిళా సాధికారతకు సంకేతం కాదు. వాటిని ప్రభుత్వం నిర్వహించరాదు. మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచే మిస్‌వరల్డ్ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలి' అని వినతిపత్రంలో పేర్కొన్నారు. మే 10న ప్రారంభమై...31న గ్రాండ్ ఫినాలేతో ముగుస్తామని తెలిపారు. తెలంగాణ మహిళలకు ఈ పోటీలు ఏ మాత్రం గర్వకారణం కాదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రతిష్టను ఇనుమడింప చేసేందుకు ఎన్నో మార్గాలుండగా మహిళలకు అవమానకరమైన పోటీలను ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. మహిళలను ప్రదర్శన వస్తువుగా చూపించి, సామ్రాజ్యవాద మార్కెట్‌కు ప్రయోజనాలు చేకూర్చే ఈ పోటీలకు హైదరాబాద్ వేదిక కావడం సిగ్గుపడాల్సిన విషయమని వారు అభిప్రాయపడ్డారు. ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోగా, వారి దృష్టిని మళ్లించేందుకు ఈ అందాల పోటీలను నిర్వహిస్తున్నదని విమర్శించారు. స్త్రీల శరీరాలకు కొలతలు విధించి, అశ్లీల ప్రదర్శనలతో తమ సౌందర్య ఉత్పత్తులను అమ్ముకునేందుకు ఈ పోటీలు సాధనమని తెలిపారు. తద్వారా దేశ ప్రతిష్ట ఎలా పెరుగుతుందో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న మిస్‌వరల్డ్ పోటీలను రద్దు చేసేంతవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.

మేడ్చల్‌లో లోహియా గ్రూప్ బిస్కెట్ల తయారీ యూనిట్ ఏర్పాటు

హైదరాబాద్ : రాష్ట్రంలోని మేడ్చల్‌లో లోహియా గ్రూప్ అంతర్జాతీయ స్థాయి బిస్కెట్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ ఆటోమెటెడ్ కేంద్రంలో నెలకు 1,000 టన్నుల బిస్కెట్లను తయారు చేసే సామర్థ్యం ఉందని పేర్కొంది. దీన్ని 5,000 టన్నులకు విస్తరించే అవకాశం ఉందని ఆ సంస్థ బుధవారం వెల్లడించింది. రూ.300 కోట్ల పెట్టుబడులతో అందుబాటులోకి తెస్తోన్న ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 6,000 ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని లోహియా కాన్ఫెక్షనరీ ప్రయివేటు లిమిటెడ్ ఎండి మనిషా లోహియా లహోటి తెలిపారు.

ఎస్‌ఎల్‌బిసి కాలువ లైనింగ్‌కు రూ.442 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎలిమినేటి మాధవరెడ్డి ఎస్‌ఎల్‌బిసి కాలువకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులకు గాను రూ. 442 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన ఉత్తర్వులు ఇస్తూ జిఒ జారీ చేసింది. ఈమేరకు బుధవారం నీటిపారుదల, ఆయకట్టు శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జ ఆదేశాలు జారీచేశారు. ఈ కాలువ 1983లో 42 ఏండ్ల క్రితం నిర్మించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు, 516 గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టు ఉద్దేశించింది. అలాగే ఫ్లోరైడ్ బాధితులు సమస్య పరిష్కారానికి పుట్టంగండి దగ్గర పంప్‌హౌస్ సైతం నిర్మించి కాలువ తవ్వారు. పైపులైన్ కోసం కాలువను నిర్మించారు. ఇపుడు మెయిన్‌కాలువ సిమెంట్ కాంక్రీట్ కోసం 23.5 కిలోమీటర్ల నుంచి 136.150 కిలోమీటర్ల వరకు జరిగే పనుల కోసం ఈ నిధులు ఖర్చు చేయనున్నారు. మొత్తం కాలువ పొడవు 112.65 కిలోమీటరుగా ఉన్న సంగతి తెలిసిందే.

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పట్ల నిర్లక్ష్యం

- జీతాలు పెంచకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జెఎసి నాయకుల హెచ్చరిక
- నిరసన దీక్ష, భారీ ధర్నా


ధర్నా చేస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జెఎసి నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల శ్రమను యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, కార్మికుల శ్రమను గుర్తించి జీతాలు వెంటనే పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద బుధవారం భారీ నిరసన దీక్ష, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జెఎసి నాయకులు మాట్లాడారు. కల్లబొల్లి మాటలు ఆపి కార్మికుల సంక్షేమం కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో వెంటనే ప్రకటన చేయాలని కోరారు. దశలవారీగా కాంట్రాక్టు కార్మికులు ఉద్యమాలు నిర్వహించాలని సూచించారు. సింగరేణి ప్రధాన అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వ ప్రజాప్రతినిధులకు, ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులకు, ఉప ముఖ్యమంత్రికి యూనియన్ల అన్నింటి తరపున వినతి పత్రాలు, మనగోడు చెప్పినప్పటికీ ఫలితం లేదన్నారు. త్వరలోనే జీతాలు పెంచుతామని ప్రకటన చేసి సంవత్సరం గడిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సీఅండ్ఎండి బలరాం నాయక్‌ని కలిసిన జెఎసి నాయకులు కోదండరామ్‌తో చర్చలు జరిపినప్పటికీ ఎటువంటి మార్పు లేదన్నారు. కోలిండియా వేతనాలు అమలు చేయాలని, జీవో నెంబర్ 22న అమలు చేసి గెజిట్ చేసి వెంటనే కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40 వేల మంది కార్మికులు సింగరేణిలో పనిచేస్తుంటే సంస్థ లాభాల్లో అత్యధిక భాగం కాంట్రాక్టు కార్మికుల శ్రమ ఉందన్నారు. కాంట్రాక్టు కార్మికులం దరూ జీతాలు పెంపుదల కోసం ఒక్క తాటిపై ఉన్నారని, జెఎసి ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటం ఉగ్రరూపం దాల్చే సమయం ఆసన్నమైందని తెలిపారు. మే డేలోపు జీతాలు పెంచకపోతే తదనంతరం అన్ని యూనియన్లతో కలుపుకొని పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దీక్షాశిబిరాన్ని కాంట్రాక్టు కార్మిక సంఘాల జెఎసి నాయకులు మల్లెల రామనాథం, ఏజే.రమేష్, ఆర్. మధుసూదన్, కాపు కృష్ణారెడ్డి, ఎం.శ్రీనివాస్, విశ్వనాథ్ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ధర్నాకు జెఎసి నాయకులు భూక్య రమేష్, పి.సతీష్ అధ్యక్షత వహించగా, సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జెఎసి రాష్ట్ర నాయకులు బి.మధు, ఎస్.కె.యాకుబ్ షావలి, యాకయ్య, మేడిపల్లి కరుణాకర్, రాంసింగ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు దూలం శ్రీనివాస్, కె.బ్రహ్మాచారి, డి.వీరన్న, రాజశేఖర్, చంద్రశేఖర్, సక్రం, రాజేష్, శంకర్, విజయ్, ఉప్పెర్ల ప్రశాంత్, శంకర్, మల్లేష్, రవి, సమ్మయ్య, రాణి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ సంఘీభావం, మద్దతు

సింగరేణి కాంట్రాక్టు కార్మికులు న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పోరాటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు చంద్రఅరుణ, కార్యదర్శి జాటోత్ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జెబీ శౌరి, ఎంఎల్ జిల్లా నాయకులు కందగట్ల సురేందర్, ఏఐఎఫ్‌టీయూ రత్నకుమార్, సిపిఎం పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు, డి.వీరన్న, నందిపాటి రమేష్, గోపాల్‌రావు సంపూర్ణ మద్దతు తెలిపారు.



టెన్త్ ఫలితాల్లో శ్రీచైతన్య హవా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు విజయభేరి మోగించారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ మాట్లాడుతూ ఈ ఫలితాల్లో 594 మార్కులను సాధించి విజయకేతనం ఎగరవేశామని అన్నారు. 593 మార్కులు ఆపైన ముగ్గురు, 580 ఆపైన 374 మంది, 550 ఆపైన 3,969 మంది విద్యార్థులు సాధించారని వివరించారు. ఇంగ్లీష్‌లో 10,866 మంది విద్యార్థులు ఏ గ్రేడ్, సాంఘిక శాస్త్రంలో 10,320 మంది విద్యార్థులు ఏ గ్రేడ్, సెకండ్ లాంగ్వేజ్‌లో 10,158 మంది ఏ గ్రేడ్, సైన్స్‌లో 9,983 మంది ఏ గ్రేడ్, మ్యాథ్స్‌లో 9,898 మంది ఏ గ్రేడ్, ఫస్ట్ లాంగ్వేజ్‌లో 9,786 మంది ఏ గ్రేడ్‌ను సాధించారని చెప్పారు. 11,482 మంది విద్యార్థులకుగాను శ్రీచైతన్య స్కూల్ సగటు మార్కులు 600కు 531 సాధించారని అన్నారు. శ్రీచైతన్య స్కూల్‌లో 99.3 శాతం ఉత్తీర్ణత నమోదైందని వివరించారు. అత్యధిక బ్రాంచ్‌లు వందశాతం ఫలితాలను సాధించాయని చెప్పారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సీవో ఐపీఎల్, సీ ఐపీఎల్, ఎంపీఎల్, ఐకాన్, సీ బ్యాచ్, ఎస్ బ్యాచ్, టెక్నో వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్‌లు, మైక్రో లెవల్ బోధనా విధానంలో అంకితభావంతో పనిచేసే అధ్యాపకుల వల్లే ఇలాంటి అద్భుతమైన ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ నాగేంద్ర పాల్గొన్నారు.



రాష్ట్రంలో రూ.1500 కోట్ల హరిత పెట్టుబడులు

- బయోవెస్ట్, స్పాన్‌టెక్ ఇంజనీర్స్, ఈకోమాక్స్ జట్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో రూ.1500 కోట్ల హరిత పెట్టుబడులకు బయోవెస్ట్, స్పాన్‌టెక్, ఈకోమాక్స్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంస్థలు ఉమ్మడిగా ప్రకటించాయి. బయోగ్యాస్ రంగంలో నూతన యుగాన్ని ప్రారంభించడానికి చేతులు కలిపినట్లు పేర్కొన్నాయి. ఈ భాగస్వామ్యంలో స్పాన్‌టెక్ తమ అత్యాధునిక బయోజినీ బయోగ్యాస్ వృద్ధి వ్యవస్థలను బయోవెస్ట్‌కు అందించనుంది. దీనికి కావాల్సిన సాంకేతికతను స్పాన్‌టెక్ కల్పించనుంది. ఈకోమాక్స్ తెలుగు రాష్ట్రాల్లో అమలుకు భాగస్వామిగా ఉండనుంది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బయోవేస్ట్ ద్వారా భూసారం తగ్గుతుందన్నారు. దీంతో దిగుబడి తగ్గడం ద్వారా రైతుల ఆదాయం పడిపోతుందన్నారు. బయోవేస్ట్‌ను సహజ వనరులుగా మార్చడం ద్వారా నేలతల్లి సారవంతంగా మారనుందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చిన ఈ సంస్థలకు ప్రభుత్వ మద్దతు ఉంటుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

మారుతున్న ప్రపంచం

- సంపద సృష్టికర్తలు ఇంకా పేదరికంలోనే ఎందుకు?
- ఐక్య ఉద్యమాలకు అండగా ఉంటా : జస్టిస్ చంద్రకుమార్
- తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ - జెఎసి రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచం మారుతున్నదనీ, అనేక దేశాల్లో కార్మికులు, రైతులు, ఉద్యోగుల ప్రయోజనాలను కోరే ప్రభుత్వాలు వచ్చాయని జస్టిస్ చంద్రకుమార్ తెలిపారు. ప్రజల ప్రయోజనాలను కోరే ప్రభుత్వాలను అక్కడి ప్రజలు తెచ్చుకున్నారని చెప్పారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్స్-జెఎసి చైర్మన్ కె ఈశ్వర్ రావు అధ్యక్షతన బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చంద్రకుమార్ మాట్లాడుతూ పోరాటం చట్టబద్ధంగా, ఐక్యంగా చేయాలని సూచించారు. సమస్త సంపదలను సృష్టిస్తున్న కార్మికులు, శ్రామికులు, పేదలు ఇంకా పేదలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంపద సృష్టికర్తలకు ఆదాయంలో 10 శాతం వస్తుంటే యజమానులు 90 శాతం తీసుకుంటున్నారనీ, దీని వల్లే సమాజంలో ఆర్థిక అసమానతలు ఉన్నాయని వివరించారు. విద్య, వైద్యంలో ప్రయివేటీకరణ పెరిగి దోపిడీ పెరిగిందన్నారు. అనేక దేశాల్లో విద్యకు బడ్జెట్‌లో 20 నుంచి 25 శాతం కేటాయిస్తుండగా, మన దేశంలో కేవలం 2.5 శాతం వరకు మాత్రమే కేటాయిస్తున్నారని విమర్శించారు. దీంతో పేదరికం వల్ల చదువుకోలేనీ, చదువు కొనలేని, వైద్యం చేయించుకోలేని దుస్థితి దాపురించిందని తెలిపారు. రాజకీయ నాయకుల ప్రయివేటు విద్యాలయాలు, వైద్యశాలలు నడిచేందుకు ఉద్దేశపూర్వంగా ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల లేమి కోసం కుట్రలు చేస్తుంటారని చెప్పారు. ఇదంతా ఉద్దేశపూర్వకంగా చేసేదే కానీ, బడ్జెట్ లేనందువల్ల కాదని తేల్చి చెప్పారు. ధరలు తగ్గించలేనీ, నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేనీ, ఉచిత విద్య, వైద్యం అందివ్వనీ, రైతు ఆత్మహత్యలను నివారించనీ, నాన్ పర్ఫార్మెన్స్ అసెట్స్ పేరుతో బడా పెట్టుబడీదారులకు రూ.14 లక్షల కోట్లను మాఫీ చేసి ప్రజల సొమ్మును కొల్లగొట్టిన పాలకులు ఎవరి కోసం పని చేస్తున్నారో అర్థం చేసుకోవాలని కోరారు. ప్రపంచంలో అనేక దేశాల్లో ఉచిత విద్య, వైద్యం అమలవుతుంటే మన దేశంలో ఎందుకు కావడం లేదో తెలుసుకోవాలన్నారు. ఆర్టిజన్ల కన్వర్షన్ కోసం జరిగే చట్టబద్ధ ఐక్యపోరాటానికి తన మద్దతు ఉంటుందని ప్రకటించారు.

కె.ఈశ్వర్‌రావు మాట్లాడుతూ ఆర్టిజన్స్‌కు కన్వర్షన్ సాధించేంత వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యుత్ సంస్థలో 20 వేల మంది ఆర్టిజన్లుగా పని చేస్తున్నారనీ, 2017లో 23,667 మంది ఉండగా, వారిలో కొంత మంది రిటైర్ కాగా, మరికొంత మంది విధి నిర్వహణలో మరణించారని తెలిపారు. ఈ సమావేశంలో జెఎసి కన్వీనర్ ఎం.ఏ.వజీర్, కో చైర్మెన్ జి.నాగరాజు, కో కన్వీనర్ కందికొండ వెంకటేశ్, జాయింట్ సెక్రెటరీలు ఎస్.చంద్రారెడ్డి, కె.లింగం, పి.మురళీ, కె.రఘునాథరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు పి.కోటి గౌడ్, సలీం పాషా, మీడియా ఇన్‌ఛార్జి జె.ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.